# ఎక్కడమ్మా నీవులేనిదీ

ఎక్కడమ్మా నీవులేనిదీ
ఏమిటీ నువు చేయలేనిదీ

నాట్లు వేశావూ కలుపుతీశావూ
కోతకోశావూ నురిపిడి చేశావూ
వ్యవసాయంలో నువులేకుంటే నోటికాడికీ కూడేరాదూ ... ఎక్కడమ్మా ...

నింగికి ఎగిరావు సంద్రంలోతును చూశావూ
ఝాన్సీవైనావూ వీర రుద్రమవైనావూ
భద్రకాళిగా సమరం చేసీ రుద్రనేత్రిగా వెలుగొందావూ ... ఎక్కడమ్మా ...

డాక్టరువైనావూ, యాక్టరువైనావూ...
కలెక్టరువైనావూ, మినిష్టరువైనావూ...
ఇంతులపని గుర్తించని వారికి గంతలునీవే విప్పేయాలి ... ఎక్కడమ్మా ...

కొండలు తొలిచావూ, బాటలువేశావూ...
డాములు కట్టావూ, కాల్వలు త్రవ్వావూ...
సమాజగమనం నువులేకుంటే గతితప్పి గంగపాలౌతుంది. ... ఎక్కడమ్మా ...

# మేధావి లోకమా మేలుకో మేలుకో ..

మేధావి లోకమా మేలుకో మేలుకో
కళ్ళు తెరచి నీవారిని ఒక్కసారి చూసుకో

కలమును నీచేతికిచ్చి హలమును చేపట్టినారు
నీడలోన నిన్ను పెట్టి ఎండలోన మండినారు
పరమాన్నము నీకు పెట్టి పస్తులతో ఎండినారు
ఎవరువారు ?
ఎవరివారు ?
అక్షరాలు రానివారు
అంధకారమందు నేడు బందీలై ఉన్నారూ
వెలుగునీవు తెస్తావని ఆశగ చూస్తున్నారు ... మేధావి ...

బడులు నీకు కట్టాలని బండరాళ్ళు మోసినోళ్ళు
పగలనకా రేయనకా పలకలెన్నో చేసినోళ్ళు
బతుకంతా నీకోసం బలపాలను సాదినోళ్ళు
ఎవరువారు ?
ఎవరివారు ?
అక్షరాలు రానివారు
అంధకారమందు నేడు బందీలై ఉన్నారు
వెలుగు నీవు తెస్తావని ఆశగ చూస్తున్నారు. ... మేధావి ...

అమ్మ అయ్య కూలికెళితె ఆడించిన అక్కయ్యలు
పాలేరుగ తాను మారి చదివించిన అన్నయ్యలు
పుస్తెతాడు కుదువపెట్టి పై చదువులు కంపినోళ్ళు
ఎవరువారు ?
ఎవరివారు ?
అక్షరాలు రానివారు
మన తమ్ములు చెల్లెళ్ళు, మన అన్నలు అక్కయ్యలు
నావాళ్ళూ నీవాళ్ళు వీరంతా మనవాళ్లే
అంధకారమందు నేడు బందీలై ఉన్నారూ
వెలుగునీవు తెస్తావని ఆశగ చూస్తున్నారు !!
ఆశగ చూస్తున్నారు !! ... మేధావి ...

# జీవన రథయాత్రలో

1. జీవన రథయాత్రలో
జీవమైన ఓ మహిళా
నిజం నీవు తెలుసుకో
నీ బతుకును మలుచుకో || జీవన ||

2. సమత కొరకు మమత కొరకు
మంచి జగతి భవిత కొరకు
నీ జాతిని నిదుర లేపి
నీ గమ్యం చేరుకో || జీవన ||

3. చదువులేని నీ బతుకు
రెక్కలేని పక్షి బతుకు
చదువున్న నీ హృదయం
కోయిలమ్మ తీపిస్వరము || జీవన ||

4. ఇంటిలోనే వెలుగువుగా
ఈ జగతికి సారధిగా
బతుకులోని చీకట్లు
పారదోల కదులుమా || జీవన ||